
# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## రజతోత్సవ గీతం

చరిత్ర కడుపున పుట్టింది ఉద్యమాగ్ని శిశువూ
అది తెలంగాణ తలరాతను మార్చిన నవవసంత రుతువూ
వివక్ష దోపిడి విలయంలో విలవిల లాడిన వేదన
అస్తిత్వంకై ఆరాటపడిన ఆత్మగౌరవ భావన
పిడికిలెత్తిన కేసీఆర్ గొంతులో ప్రళయ గర్జన
బీఆర్ఎస్ - బీఆర్ఎస్ - బీఆర్ఎస్
జై తెలంగాణ! జైజై తెలంగాణ!!
నినదించె రుద్రవీణ

నిధులూ నీళ్ళూ నియామకాలు అన్నీ నిలువు దోపిడీ
పిడికిలెత్తితే కాల్చి చంపిన రక్తచరిత్రల రాపిడీ
పదవుల కోసం పెదవులు మూసిన మోసాలతోనే గోస
తెలగాణ రేశాన్ని చూపిన కేసీఆరె మణిపూస
అమరుల మెడలో పూల దండనే - గులాబీ జెండగ మార్చిండూ
ప్రజల కోసమై పదవుల నొదిలీ పోరుబాటనే పట్టిండూ
బీఆర్ఎస్ - బీఆర్ఎస్ - బీఆర్ఎస్
జై తెలంగాణ! జైజై తెలంగాణ!!
జైజై తెలంగాణ నినదించె రుద్రవీణ

సత్యాగ్రహమే శస్త్రమై - అహింసయే తన అస్త్రమై
ప్రజాశక్తినే ప్రదర్శించిన బహిరంగ సభల చేతనం
రహదారులనే దిగ్బంధించిన జాగృత జన జయ కేతనం
సమరాంగణమున సకలజనులను ఏకం చేసిన నైపుణ్యం
కేసీఆరు దీక్షపూనితే దిగివచ్చింది ఢిల్లీ
జోహారన్నది ప్రతి హృదయం- అమర వీరులకు ప్రణమిల్లి
బీఆర్ఎస్ - బీఆర్ఎస్ - బీఆర్ఎస్
జై తెలంగాణ జైజై తెలంగాణ
జైజై తెలంగాణ నినదించె రుద్రవీణ

అర్ధ శతాబ్దపు ఆశయ సాధన నూతన రాష్ట్ర అవతరణం
నవశకానికి నాంది పలికినది కేసీఆర్ సారథ్యం
బీడు భూముల దాహం తీర్చెను గోదారి కృష్ణ నీళ్ళు
తుడుచుకున్నది తెలంగాణము తరతరాల కన్నీళ్లు
ఆకలి కేకల తెలంగాణమూ అన్నపూర్ణగా మారిందీ
అభ్యుదయంలో సంక్షేమంలో అగ్రపథానికి చేరిందీ
బీఆర్ఎస్ - బీఆర్ఎస్ - బీఆర్ఎస్
బీఆర్ఎస్ రజతోత్సవం
తెలంగాణ విజయోత్సవం



దేశపతి శ్రీనివాస్
శాసనమండలి సభ్యులు



## ఉన్నవాళ్లు

మళ్లీ పొరపాటు పడ్డాను
అతను నా కోసం ఫోన్ చేయలేదు
మొదట క్షేమం అడిగింది
అతని పనిని సరిగ్గా వినడానికి

ఎలా వచ్చాయో అలాగే పోయాయి
సముద్రంలో అలల్లాగే
సిరిసంపదలూ
చివరికి ఎడతెగని బాధలు కూడా

ఇంత చేసిన తండ్రీ!
మాయగాడా
కన్నుమూసేటప్పుడు
ఇంత కాఠిన్యమేల నీకు

కన్నీళ్లు ఉన్నవాళ్లే
ఉన్నవాళ్లు
అవి లేని కళ్లు
ఎడారుల కంటే బీళ్లు

నీరు లేని ఎడారిలో కూడా
కన్నీరు కవిని
అంటిపెట్టుకునే
ఉంటుంది

తెలివి తెల్లారిందంటే
మొదట అర్థం కాలే
వెచ్చాల దగ్గర గిచ్చి గిచ్చి బేరమాడి
పసిడి కొనుగోలు దగ్గర
ఉదారంగా ధారపోసినప్పటి దాకా

కాలం వేగంగా
నడుస్తుందంటారు గానీ
మొత్తం ఖాళీగా ఉండి చూడండి
చిన్నప్పటి కంటే మెల్లగా నడుస్తుంది
గడియారం ముల్లు!

ఆ రోజులు వేరు కదా! కొడుకా
నిన్ను నవ్వించడానికి బోల్తా పడ్డా!
ఇప్పుడు కాలం తిరగబడ్డది
నువ్వు నవ్వుతున్నవ్, నే బోల్తాబడ్డ!

అది రహదారి
తను నడవకుండా
మనల్ని నడిపించే
జిత్తులమారి

అంతెత్తు ఎదిగాక
ఎక్కువ మాట్లాడకూడదు మరి
స్వర్గంలో దేవతలకు
విశ్రాంతి భంగమవుతుంది

అది ఆకాశం
తానెక్కడా లేకుండానే
అంతటా ఉన్నాననే
ఊహా సుందరి


ఎవరూ ఏదీ పుట్టియ్యరు
సృష్టిలో ఉన్నదాన్నే
సహస్రాంశంలో సహస్రాంశాన్ని
కనిపెడతరు



ఏనుగు నరసింహారెడ్డి
89788 69183

ప్రపంచ సాహిత్య చరిత్రను ఒకసారి పరిశీలిస్తే ప్రతి భాషలోనూ కొన్ని యుగాలు, మహత్తరమైన జీవశక్తితో, అపరిమిత వేగంతో కదిలి, తావులన్నింటినీ కదిలించి పరవశింపజేశాయి. ప్రవహించిన కాలానికి ఇవి ప్రతినిధులై నిలిచాయి. మరికొన్ని యుగాలు ఆ కవితా ప్రవాహంలో క్షీణించి కొన్ని వేల పిల్ల కాలువలై చివరకు మురికికి ఆలవాలమై, ఆ నీరు కూడా నిలువక ఆవిరై ఏమీ మిగలకుండా పోయే క్షీణదశకు ప్రతీకలుగా నిలిచాయి.

# కవిత్వం కావాలి



'తెలుగులో ప్రస్తుతం కవిత్వం ఎలా ఉంటున్నది? దానికి స్థానం ఎటువంటిది?' అని సాహిత్యాభిరుచి ఉన్న తెలుగువాడు ప్రశ్నించుకుంటే దానికి సమాధానమేమిటి? 'నా మాతృభాషలో వెలువడుతున్న ఉత్తమ కవనం ఇది' అని గర్వంగా చెప్పుకోదగిన స్థితిలో కవిత్వం ఉన్నదా? లేక 'ఇది కవిత్వమేనా' అని ఆధునిక విమర్శకుడు లేక పాఠకుల్ని సందిగ్ధావస్థలో పడేసే రీతిలో ఉన్నదా? కవిత్వ తత్వాన్ని కొంచెం లోతుగా పరికిస్తే ఈ ప్రశ్నలకు సమాధానాలు అసాధ్యం కాదని తెలుస్తుంది.

సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ కవిత్వానిదే అగ్రతాంబూలం అన్నది నిర్వివాదాంశం. సూటిగా గుండెలకు హత్తుకునే రీతిగా సౌందర్య పరిమళంతో, సూక్ష్మరూపంలో భావాన్ని వ్యక్తం చేయగలిగింది కవిత్వం మాత్రమే. ఇక్కడ కవిత్వం అనే మాట రామాయణ, మహాభారత మహాకావ్యాల నుంచి నేటి వచన కవిత, ప్రతిఘటన కవిత, మినీ కవిత, స్త్రీ వాద, దళితవాద, ముస్లింవాద కవితా ఖండికల వరకు అనువర్తిస్తుంది.

సాహిత్యంలోని విభిన్న రూపాలకు సంక్షిప్త రూపాలుగా నేడు కవితలు, కథానికలు, వ్యాసాలు, స్కెచ్‌లు, ఏకాంకికలు, అవధాన కవిత్వం, భావకవిత్వం, దేశభక్తి కవిత్వం, అమలిన శృంగార కవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచన కవిత్వం, దిగంబర కవిత్వం, ప్రతిఘటనా కవిత్వం, విప్లవ కవిత్వం, మినీ కవిత్వం, తిరుగబడు కవిత్వం, స్త్రీ వాద, దళితవాద, ముస్లిం వాద కవిత్వం అనేవి ఆధునిక తెలుగు కవిత్వంలో నేటి వరకు జరిగిన పరిణామాన్ని సూచించే కవిత్వోద్యమాలు. ఇందులో నేటి తెలుగు కవిత్వం పేరిట అపరిమితంగా ప్రచురితమవుతున్న వచన కవిత్వానికి అధికంగా వర్తిస్తుంది. కవిత్వాన్ని సూచించే కవిత్వోద్యమాలు. కవిత్వాన్ని, జనసామాన్యానికి అందించే పత్రికలు విరివిగా నెలకొల్పడం, అసంఖ్యాకులైన కవులు ఉత్సాహంతో కవిత్వాన్ని రచించడం చాలా ముదావహమైన విషయం. శక్తి, ఉత్సాహం, ప్రతిభ సంకుచిత మార్గాలు పట్టకుండా తమకు తామే ఇనుప గోడల్ని నిర్మించుకోకుండా జాగ్రత్త పడాలి. తెలుగువాడికి దురదృష్టవశాత్తు నేడు అప్రమత్తత లోపించింది. కవులు, రచయితలు తాము ఫలానా వర్గానికి చెందినవారమని, తమ కవిత్వానికి ఫలానా సిద్ధాంతం ప్రాతిపదిక చేస్తామని రొమ్ము విరుచుకోవడం, ప్రతిభ లేకుండానే పరనిందకు పూనుకోవడం అలవాటైపోయింది. రమణీయమైన శిల్ప నిర్మాణంలో అనుభవ వ్యక్తీకరణ ఉండాలి.

> ఏది ఉత్తమమైనది? ఏది ఆచరణ యోగ్యం? అనేది ఈ వ్యాసంలో చర్చనీయాంశం కాదు. కవిత్వంపై రాజకీయ సిద్ధాంతాల ప్రభావమై, ఆ సిద్ధాంతాలు నిర్ణయించిన పరిధిలోనే గుడుగుడు గుంజాల అనే ప్రలోభం కవిత్వాన్ని క్రమంగా ఎలా హత్య చేస్తుందో చెప్పడం ముఖ్య ఉద్దేశం.

'నేను ఫలానా వర్గానికి చెందిన కవి'నను కొని కవిత్వం రాయడం, అలా అందరూ రాయాలని బాకా ఊదడం, ఆత్మహత్య కన్నా ఘోరమైన నేరం. సమర్థుడైన కవి రూపంతో గాని, ఒక ప్రత్యేక రాజకీయ సిద్ధాంతంతో గాని నిమిత్తం లేకుండా ఉజ్వలమైన కవిత్వాన్ని సృష్టించగలడు. అది పద్యమైనా, వచనమైనా, కవిత్వమైనా ప్రతిఘటన అయినా, మినీ కవిత అయినా ఒకటే.

కవిత్వంలో ప్రాచీన రీతులను దుయ్యబట్టడమూ లేక ఆధునిక మార్గాన్ని విమర్శించడమూ అసమర్థతను మాత్రమే తెలియజేస్తుంది. చదివినప్పుడు గాని అధికారాన్ని బట్టి కాదు. శ్రీశ్రీ అనగానే స్ఫురించేది నయాగరా జలపాతం వంటి ఆయన కవిత్వం. మహోన్నత శిఖరాలను అందుకున్నది మహాప్రస్థానం. అలాగే విశ్వనాథ సత్యనారాయణ కవి అంటున్నామంటే అది ఆయనకు గల సనాతన ధర్మ పాండిత్య పక్షపాతం వల్ల కాదు. విశ్వనాథ అనగానే మెరుపువలె ఆలోచనలో మెరిసేవి ఆయన కిన్నెరసాని పాటలు. అంటే శ్రీశ్రీ, విశ్వనాథలు మార్క్సిస్టు, సనాతన భావ గ్రంథికి ప్రతినిధులుగా కాక మానవ జీవితాన్ని రమణీయ కావ్యాలుగా మలచిన శిల్పులుగా, కవులుగా మనకు గుర్తుకొస్తారు.

ఇక్కడ చిన్న విషయం మరువకూడదు. ఈ కాలపు కవికి వివిధ రంగాలతో పరిచయం ఉండి ఒకే ప్రత్యేకమైన రంగంలో చెప్పుకోదగిన ప్రవేశమూ, ప్రజ్ఞ ఉంటే.. అది అతని కవిత్వ స్వభావానికి మెరుగుగా భాసించవచ్చు. ప్రవేశమూ, ప్రజ్ఞ లేనంత మాత్రాన అతని కవిత్వం అంతరించదు. అతడు కవిగా రాణించడం ఆగదు. బంగారం ఉత్పన్నం చేయబోయి కనీసం స్వచ్ఛమైన ఇనుమునైనా కవులు అందించలేకపోతున్నారు. రచనలో కవిత్వం ఎంతమాత్రం వెల్లివిరుస్తుందో మనం గమనిస్తూనే ఉన్నాం.

అంటే, ఒక కవికి గీటురాయి అతడు మార్క్సిస్టా, నక్సలిస్టా, ఫెమినిస్టా, మరొక ఇస్టా కాదన్నమాట. సిసలైన కవిత్వం హృదయ సంబంధియే కానీ, విజ్ఞాన సంబంధి కాదు. ఒక కవికి రసాయన శాస్త్ర సమీకరణ గురించి, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం గురించి తెలియనంత మాత్రాన అతనిని కవి కాదనడం ఎంత అసందర్భమో, మార్క్సిజం సిద్ధాంతం తెలియనంత మాత్రాన అతనిని కవి కాదనడం కూడా అలాంటిదే. కవికి తన ప్రతిభతో పాటు శాస్త్ర విజ్ఞానం కూడా ఉంటే సంతోషమే. కానీ, శాస్త్ర విజ్ఞానముంటేనే అతడు రాసింది కవిత్వం అవుతుందనటం కేవలం కవిత్వం తెలియని వారనవలసిన మాట. స్వర్గీయ తిలక్ అన్నట్టు కవిత్వం ఒక ఆల్కెమీ.



కె. ప్రభాకర్

(వ్యాసకర్త: విశ్రాంతాచార్యులు)



## బాధ

బాధ,
ఐరావతమై, గుండె పొర మీద
నింపాదిగా కూర్చుంది
చూపును కాపు కాచే కనురెప్పలు
బరువుగా మూతపడ్డయి
గుసగుసల శబ్దాల్ని సైతం
ఆకళింపు చేసుకునే వీనులు
వినజాలని బధిర గుహలో దూరినై
జిహ్వ మీది మాటలు, తడియారి,
ఉనికి పోగొట్టుకున్నయి
చీకటిలా, భయంకరమైన నిశ్చలమై
ఎక్కడ పారుతున్నదో లేదో
తెలియని అయోమయావస్థలో
రక్త నది తెల్లబోయింది
నరాల దారులు మ్యూకస్
కబ్జాకు లోబడినై
ముఖబింబంలో వెలుగు బింబం
వికసించటం మానేసింది
హస్తాలు, ఆకాశ కేళిలో పాల్గొనటంలేదు
కాళ్లు, సముద్రాన్ని లంఘించే
పద్యం మరిచిపోయింది
తీపి పెదవులు వర్రెలు తేలిన వాగులైనయి
గిలగిల కొట్టుకున్న
ఊహలే, ముంగిట్లో వాలినై
శుష్కప్రియాల, శూన్యహస్తాల
రుతుపవనాల్లా,
భావనలు కురిసేదేం లేదు

బాధా ప్రియతమా! నువ్వావహించి,
కొత్త జన్మలో మేల్కొనేటట్లు చేశావు

మార్పోదయమే యిప్పటి నుంచి..

మనిషిని ఆత్మగీతంలా పాడుకుంటున్నా
రాలే కంటి బిందువుకు దోసిలౌతున్నా
లోకం పలకపై, నువ్వుండని లోకాన్ని
సృజించబోతున్నా

మరి వెళ్తావా!
పోతూ పోతూ, కొన్ని కన్నీటి చుక్కల్ని
మానవ సమూహాలపై చిలకరిస్తూ పో!
మళ్ళీ నీ అవసరం వుండదు,
ఒట్టు..



దాసరాజు రామారావు

# అభ్యుదయ కవి కాంచనపల్లి



'కాళ్ళకును బంధాలు/ చేతులకరదండాలు మూతులకు చిక్కాలు/ మూల్గితే లాఠీలు రొమ్ములకు తూటాలు/ రోతలీ పాలన'లంటూ బానిస బతుకుల యథార్థ, వ్యథార్థ వాస్తవాలను తన కవితలో నిర్భయంగా చెప్పిన అభ్యుదయ కవి కాంచనపల్లి చిన వెంకట రామారావు నల్లగొండ జిల్లాకు పెద్ద దిక్కులాంటివారు. తెలంగాణ విముక్తి కోసం ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన కాంచనపల్లి కవిగా కథా రచయితగా సుప్రసిద్ధులు. 1921 ఏప్రిల్ 21న సూర్యాపేటలోని రావిపాడు గ్రామంలో జన్మించిన కాంచనపల్లికి 1934 నుంచి సారస్వత పరిచయం ఏర్పడింది. స్వాతంత్ర్య పోరాటంలో అడుగడుగునా కలిగిన అనుభూతులకు శబ్దరూపం ఇచ్చి అక్షరత్వం కల్గించారు. ఫలితంగా 'అరుణ రేఖలు' అనే కావ్యం వెలువడింది. నిజాం నిరంకుశ అధికారంపై తిరుగుబాటుతో, సమాజంలోని అన్యాయాలపై ధిక్కారంతో ప్రజ్వలించి రౌద్రంగా, మహోద్రేకంగా అరుణ గీతాలను రాశారు. ఇందులోని ప్రతి పద్యం సూదిపోటులా గుండెలను సూటిగా తాకుతుంది. ఈ కావ్యం ద్వారా కాంచనపల్లి అభ్యుదయ కవులకు, ప్రజా కవులకు మార్గదర్శకులైనారు.

కాంచనపల్లి 1938-39లో నల్లగొండలో తొమ్మిదో తరగతి చదువుకుంటున్న రోజుల్లోనే సాహితీ మేఖల వ్యవస్థాపకులైన అంబటిపూడి వెంకటరత్నం రాఘవాచార్యులు అనే కవి అకాల మరణంపై రాసిన స్మృతిగీతాలు పులిజాల రంగారావు ఇంట్లో చదివినప్పుడు ఆ పద్యాలు కాంచనపల్లిని ఎంతో ప్రభావితుణ్ణి చేశాయి. అప్పటికే సురవరం ప్రతాపరెడ్డి వ్యావహారిక భాషా వాద పక్షానికి వచ్చారు. యతిప్రాసలు లేకుండా పద్యాలెందుకు రాయకూడదు. కవిత్వగుణం, పదార్థం ఉంటే అవి రాణిస్తాయి కదా! యతిప్రాసలు కేవలం శబ్దాలంకారాలే కదా! అన్న వాదనలు ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో కాంచనపల్లి సాహసించి యతిప్రాసలు లేకుండా పద్యాలు రాసి ఎవరికీ చెప్పకుండా గోల్కొండ పత్రికకు పంపిస్తే సురవరం ప్రచురించారు. కాంచనపల్లి దుందుడుకుతనానికి ఇదొక చక్కని నిదర్శనం.

పానగల్లులో ప్రతాపరుద్ర ఆంధ్ర భాషా నిలయం ఏర్పాటులో కాంచనపల్లి ప్రముఖ పాత్ర వహించారు. 1944-45వ సంవత్సరం అప్పటికే నిజాం వ్యతిరేక పోరాటాలు సాయుధ పోరాటాలుగా మారి నిజాం భూస్వామ్య వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించడానికి సిద్ధమవుతున్న చరిత్రాత్మకమైన ఘట్టం. అలాంటి తరుణంలో కాంచనపల్లి ఆధ్వర్యంలో నల్లగొండలో ఆంధ్ర సారస్వత పరిషత్తు 3వ మహాసభలు జరిగాయి. ఈ సభలకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి, బిరుదు వేంకట శేషయ్య, ఓయూ మాజీ వైస్ ఛాన్స్‌లర్ రావాడ సత్యనారాయణ, మునిమానిక్యం నరసింహారావు వంటి సుప్రసిద్ధులెందరో పాల్గొన్నారు. మూడురోజుల పాటు సాగిన ఈ సాహిత్య తిరునాళ్లలో ఎన్నో సాహిత్య సాంస్కృతిక సంగీత ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

> 1946లో చండూరులో జరిగిన సాహితీ మేఖల దశమ వార్షికోత్సవాల సందర్భంలో కాంచనపల్లి 'మన వూళ్ళో కూడానా'! అనే కథలు రాశారు. ఆనాడు ఈ కథలు ఎంతో ప్రసిద్ధమైనవి. వెట్టిచాకిరీ వివిధ రూపాల కేంద్రీకరణను ఇందులో చక్కగా చిత్రీకరించారు. తొమ్మిది కథలతో వెలువడిన ఈ కథా సంపుటి ఆనాటి దొరల దౌర్జన్యం, పేదల దుర్భరమైన బతుకును చూపించింది.

కాంచనపల్లి తన కవిత్వాన్ని ఉద్యమ నేపథ్యంలో ప్రజలకు ప్రాణవాయువుగా అందించారు. నిరంకుశాధికారులకు వ్యతిరేకంగా ప్రతిఘటనలను ప్రతిబింబిస్తూ పోరాట పాటలు రాశారు. ఇంకా వీరు జిల్లా సమగ్ర సమాచారాన్ని అజ్ఞాతంగా ఉన్న ఎందరో కవుల గురించి, మరుగునపడిన సాహిత్యసంస్థల వివరాలను సేకరించి అనేక వ్యాసాలు రాశారు. నల్లగొండ సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో వెలువడిన 'దర్పణం' సాహిత్య మాస పత్రికకు సంపాదకుడిగా ఉండి కావ్య సమీక్షలు చేశారు. నీలగిరి, గోల్కొండ, అభ్యుదయ, తదితర పత్రికలకు అనేక వ్యాసాలు రాశారు. జిల్లాలోనే గాక, రాష్ట్ర ఉద్యమ సాహిత్యరంగాల్లోనూ కాంచనపల్లి ప్రముఖ పాత్ర వహించారు. రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘ ముఖ్యుల్లో ఒకరుగా ఉండి అభ్యుదయ భావాలను పెంపొందించుకున్నారు. నల్లగొండ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా ఉండి మూడు సార్లు మహాసభలను నిర్వహించారు. పలు పుస్తకావిష్కరణలను చేపట్టి, యువ కవులకు స్ఫూర్తిగా జిల్లాలో సాహిత్య చైతన్యాన్ని కలిగించిన గొప్ప వ్యక్తి కాంచనపల్లి.

సాహిత్యరంగంలోనే కాకుండా రాజకీయంగా కూడా కాంచనపల్లి గొప్ప అనుభవజ్ఞులు. 1952-57 మధ్య బూర్గుల రామకృష్ణారావు హయాంలో చినకొండూరు నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా పనిచేశారు. 1957 తర్వాత అనేక ప్రజా సంఘాలలో పనిచేశారు. నిరంకుశ నిజాం ఫ్యూడల్ వ్యవస్థను అంతం చేయడానికి తెలంగాణలో సాగిన వీరోచిత పోరాటంలో కమ్యూనిస్టుగా పాల్గొని కడలూరు, రాయవెల్లూరు, వరంగల్లు, నిజామాబాద్ జైళ్లలో గడిపారు. కాంచనపల్లి నిరంతరం మార్క్సిస్టు గ్రంథాలను అధ్యయనం చేసి సమాజ పరిణామ గతిని గురించి స్పష్టమైన అభిప్రాయాలను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా ఉన్నప్పుడు సోవియట్‌ను దర్శించే సదవకాశం కలిగింది. అప్పుడు కాంచపల్లి తన అనుభవాలను, అనుభూతులను 'మధుర స్మృతులు' అనే పుస్తకంలో వివరించారు. రాష్ట్ర పౌరహక్కుల కమిటీ సభ్యులుగా పనిచేశారు. అనేక ఇతర సంస్థల్లోనూ పదవులను నిర్వహించారు. కవిగా, కథకుడిగా, ఉద్యమకారుడిగా, శాసనసభ్యుడిగా, ప్రముఖ న్యాయవాదిగా, అభ్యుదయవాదిగా పేరొందిన కాంచనపల్లి 1992 మార్చి 13న కన్నుమూశారు.



పున్న అంజయ్య
93966 10639

> మహారాష్ట్రలో ముస్లిం సత్యశోధక్ మండలి వ్యవస్థాపకుడు, ముస్లిం లౌకిక, ప్రజాస్వామ్య, సంస్కరణవాది హమీద్ దల్వాయి ఇస్లాం మత, సామాజిక, రాజకీయ చరిత్రతో పాటుగా ముస్లిం మనస్తత్వాన్ని ఎలాంటి అపోహలు లేకుండా నిష్పాక్షికంగా విశ్లేషిస్తూ 'లౌకిక భారతదేశంలో ముస్లిం రాజకీయాలు' అనే గ్రంథాన్ని రాశారు. ఈ పుస్తకాన్ని ఆనందేశి నాగరాజు తెలుగులోకి అనువదించారు.

# సంకుచిత రాజకీయాలతో మతతత్వానికి ఆజ్యం

నేటి భారతంలో ఒకవైపు అన్నిరకాల అభివృద్ధి నిరోధక, ఛాందస, పునరుద్ధరణ సంప్రదాయవాదులు, మరోవైపు ఆధునిక ఉదారవాదుల మధ్య నిజమైన సంఘర్షణ జరుగుతున్నది. భారతీయ రాజకీయ నాయకులు దూరదృష్టి లోపించి స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వారు ఎల్లప్పుడూ సంప్రదాయవాదాన్నీ, మత తత్వాలను బుజ్జగిస్తారు. ఏనాడూ వాటిని వ్యతిరేకించరు. అందువల్ల, అన్ని రకాల మతతత్వాలపై రాజకీయాలకతీతంగా ఉమ్మడి పోరు చేయడానికి అన్ని వర్గాల ఉదారవాద మేధావుల మధ్య అంగీకారం ఏర్పడాల్సిన అవసరం ఉన్నది. ఇదిగనుక జరగకపోతే, భారత దేశంలో ఉదారవాదం, ప్రజాస్వామ్యం క్రమంగా నశించి తీరుతాయి.

> దల్వాయి భారతదేశంలోని సెక్యులర్ పార్టీల నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తూ ఇలా అన్నాడు... భారతదేశంలో మతతత్వాన్ని సమూలంగా నిర్మూలించడానికి ఏ రాజకీయ పార్టీ కూడా కచ్చితమైన చర్యలు తీసుకోవడం లేదు. వారు ముస్లింలను సంతృప్తి పరచడానికే చూస్తారు. నా సొంత పార్టీ ఎస్ఎస్పీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. రాజకీయాలకతీతంగా ఈ సమస్య పరిష్కారం కోసం ఒక సంస్థ ఏర్పడాలి.

హమీద్ దల్వాయి మహారాష్ట్రలోని ఒక పల్లెటూరులో నిరుపేద ముస్లిం కుటుంబంలో 1932లో జన్మించారు. మూడుసార్లు తలాక్ (విడాకులు) పదాన్ని ఉచ్చరించి ముస్లిం వివాహితకు భర్త యథేచ్ఛగా విడాకులు ఇవ్వవచ్చని చెప్పే ముస్లిం వ్యక్తిగత షరియా చట్టాన్ని ఆధునీకరించాలనీ, ముస్లింలలో బహు భార్యత్వాన్ని నిషేధించాలనీ, ఉమ్మడి పౌర చట్టాన్ని రూపొందించాలనే డిమాండ్‌తో దేశంలోనే మొట్టమొదటి సారిగా ఉద్యమించిన నిజమైన లౌకికవాద ముస్లిం మేధావి, సాంఘిక సంస్కర్త హమీద్. హేతువాది అయిన దల్వాయి అన్ని మతాల్లోని మూఢ నమ్మకాలను ప్రశ్నించి పౌర సమాజంలో అన్నిరకాల మత ప్రమేయాన్ని నిషేధించాలని కోరారు. మొదట జయప్రకాశ్ నారాయణ నేతృత్వంలోని ఇండియన్ సోషలిస్ట్ పార్టీలో పనిచేసినా, తర్వాత రాజకీయ పార్టీలకు అతీతంగా ముస్లిం సమాజంలో సాంఘిక సంస్కరణల కోసం అవిశ్రాంతంగా కృషిచేశారు. పత్రికా విలేకరిగా పనిచేసినా, మరాఠీలో కథలతో పాటుగా జాతీయ సమగ్రత, లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థల ఏర్పాటుకు ముస్లిం సమాజంలో, హిందువులలో సాంఘిక సంస్కరణల ఆవశ్యకతపై మరాఠీలో గ్రంథాలు రాశారు.

అన్ని మతాల బోధనలలో శాంతి, సహనంతో పాటుగా కాలంచెల్లిన అశాస్త్రీయ భావాలూ, లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన అంశాలూ ఉంటాయి. ఆయా మతానుయాయులలో ఆధునిక మానవీయ, లౌకికవాద, ప్రజాస్వామ్య భావాలతో ప్రేరేపితులైన వ్యక్తులు కాలానుగుణంగా తమ తమ మతాలలో సంస్కరణలు తెచ్చినట్టయితే, ఆ మత స్థులు దేశ లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థలో భాగస్వాములవుతారని దల్వాయి చెప్తూ నేను కొందరు ముస్లింల వైఖరిని విమర్శిస్తున్నానంటే, అది తమ మత విశ్వాసాలతో సంబంధం లేకుండా సమస్త భారతీయుల, దేశ విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చేస్తున్న విమర్శ మాత్రమే. ముస్లింలందరిపై చేస్తున్న విమర్శ కాదని స్పష్టం చేశారు.

భారతదేశంలో లౌకికవాదానికి దిశా నిర్దేశం చేస్తూ భారతదేశంలోని నాగరీకులందరికి ఉమ్మడి పౌర స్మృతిని ఏర్పాటుచేయాలని పట్టుబట్టాలి. దేశంలోని అన్ని వివాహాలను ఉమ్మడి పౌర స్మృతి ప్రకారం నమోదు చేయడాన్ని తప్పనిసరి చేయాలి. మత మార్పిడులను అనుమతించరాదు. రహదారులలో రాకపోకలకు ఇబ్బందికరంగా నిర్మించిన మందిరాలనూ, మసీదులను, ఇతర ప్రార్థనా స్థలాలను తొలగించాలి. అన్ని మతాల ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. వీటిద్వారా వచ్చిన ఆదాయాన్ని కేవలం విద్య, సంక్షేమ పథకాలపైనే వెచ్చించాలి. కశ్మీర్‌కు ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేయాలి. ఉర్దూ భాషాభివృద్ధికి అవకాశాలు కల్పించాలి. పూర్తిగా ఉర్దూ మాధ్యమంలో బోధించే పాఠశాలలకు పూర్తి భద్రత కల్పించాలి. అయితే, రాష్ట్రాల్లో ఉర్దూను 2వ అధికార భాషగా ప్రకటించాలనే డిమాండ్‌ను కచ్చితంగా తిరస్కరించాలి.




> భారత దేశంలోని మహిళల స్థాయిని, హక్కులను ఒకే ఒక ఉమ్మడి పౌరస్మృతి ప్రకారం నిర్దేశించాలి. ముస్లిం మహిళలు ధరించే పరదా (బురఖా) విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. దేశ ఆర్థిక, వ్యవసాయరంగాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మాత్రమే గో వధ నిషేధంపై నిర్ణయం తీసుకోవాలి.

కుటుంబ నియంత్రణను పౌరులందరికీ తప్పనిసరి చేయాలి. తమ మతం కారణంగా ఈ సంస్కరణలను వ్యతిరేకించే ముస్లింలకు షరియా చట్టంలోని అన్ని అంశాలను కచ్చితంగా వర్తింపజేయాలి. భారతదేశ ప్రజలందరినీ లౌకిక విలువలతో సమైక్య పరచడం ఒక్కటే భారత మతతత్వ సమస్యకు పరిష్కారం అని ప్రతిపాదించారు. ఇస్లాం మతంలో సంస్కరణల ఆవశ్యకతను హమీద్ దల్వాయి ఈ పుస్తకంలో వివరించాడు. నిజమైన ప్రజాస్వామ్య, లౌకికవాదం మన దేశంలో వేళ్లూనుకోవాలంటే హమీద్ దల్వాయి రచనలు ప్రతీ భారతీయుడు చదివి తీరాలి.

\- నచికేత